క్లుప్తంగా

త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రచారం



ఆవులవారిపాలెం(క్రోసూరు) : జూలై 10వ తేదీన గురు పౌర్ణమి పురస్కరించుకుని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఆవులవారిపాలెం, పెరికపాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణుడిని జగద్గురువుగా పూజించాలని వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్ అనురాధ, ఎస్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై.రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

ఎస్టీవో కుమార్‌కు సత్కారం



సత్తెనపల్లి: ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి నుంచి పెదకూరపాడు ఉప ఖజానా అధికారి కార్యాలయంకు బదిలీ అయిన ఎస్టీవో బీఆర్‌కే కుమార్‌కు వీడ్కోలు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు ఆదివారం సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీవో కుమార్ సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్, గద్దె మురహరి రావు, దాసరి శృంగారం, పి.వెంకటేశ్వరరావు, అంకాళ్ల ప్రభుదాస్, అంబేడ్కర్, నారాయణ, ఇబ్రహీం, మహంకాళి తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

క్రోసూరు: క్రోసూరుకు చెందిన పేద విద్యార్థిని వడ్లమూడి రూపాంజలి డిగ్రీ మూడవ సంవత్సరం చదువుకుంటుంది. రూపాంజలి విద్యా అవసరాల నిమిత్తం ఆదివారం మాగులూరి ఫౌండేషన్ ల్యాప్‌టాప్ అందించింది. స్థానిక ఎన్టీఆర్ విగ్రహ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో రూపాంజలికి ల్యాప్‌టాప్ అందించారు. కార్యక్రమంలో మాగులూరి ఫౌండేషన్ ప్రతినిధులు కిరణ్ కుంచనపల్లి, మాగులూరి కృష్ణారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



వినుకొండ: పట్టణంలోని పురాతన లక్ష్మీనరసింహాలయం ఆధ్వర్యంలో ధ్యానమందిర పిరమిడ్ మెడిటేషన్ సొసైటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సింగరాయకొండ ధ్యానమాస్టర్ నర్సారెడ్డి పాల్గొని మాట్లాడుతూ దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి కమిటీసభ్యులను అభినందించారు. రానున్న రోజుల్లో దేవాలయం ప్రాంగణంలో మెడిటేషన్, యోగాక్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలని, ఆరోగ్య సమస్యల పరిష్కారంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కమిటీ సభ్యులు, జాజుల మాల్యాద్రి, బద్దిక వెంకట నరసింహారావు, కాకుమాను రామారావు, ఉపేంద్ర, నాగలక్ష్మి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ రేటింగ్‌లో ఈశ్వర్ రేవంత్

మాచర్ల రూరల్: పట్టణానికి చెందిన చెస్ క్రీడాకారుడు ఈశ్వర్ రేవంత్ అంతర్జాతీయ ఫీడే రేటింగ్ టోర్నమెంట్‌లో పాల్గొని అంతర్జాతీయ రేటింగ్ క్రీడాకారులను ఓడించి రేటింగ్‌లో 1430 పాయింట్లు సాధించినట్లు చెస్ కోచ్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన అంతర్జాతీయ ఫీడే రేటింగ్ టోర్నమెంట్‌లో ఈశ్వర్ రేవంత్ పాల్గొని మంచి ప్రతిభ కనబరచి రేటింగ్ క్రీడాకారులను ఓడించటం ద్వారా ఈ ఘనత సాధించినట్లు చెప్పారు. అంతర్జాతీయ చదరంగ సమైఖ్య శనివారం ప్రకటించిన కొత్త రేటింగ్ క్రీడాకారుల జాబితాలో ఈశ్వర్ పేరును చేర్చినట్లు ఆయన చెప్పారు. మాచర్ల నుంచి పల్నాడు చెస్ అకాడమి తరఫున ఘనత సాధించిన 7వ క్రీడాకారుడుగా ఈశ్వర్ గుర్తింపు పొందినట్లు కిరణ్ వివరించారు.

వరకట్నం వేధింపులపై కేసు

నాదెండ్ల: వరకట్నం వేధింపులపై కేసు నమోదైంది. నాదెండ్ల ఎస్‌ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. జంగాలపల్లె గ్రామానికి చెందిన అనుషరాణికి హైదరాబాద్‌లో నివాసం ఉండే రాజేశ్వరరెడ్డితో ఏడాది క్రితం వివాహమైంది. కొద్ది నెలల నుంచి భర్త, అత్తమామలు, ఆడబిడ్డ అధిక కట్నం తేవాలంటూ అనుషరాణిని వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో ఆమె నాదెండ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశారు.

టీకాలే పశువులకు రక్ష



మాదలలో ఆవుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది



నార్నెపాడులో గొర్రెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- వర్షాకాలంలో పశువులకు వ్యాధుల ముప్పు
- జాగ్రత్తలు పాటిస్తే తప్పనున్న ప్రాణాపాయం
- ముందస్తు టీకాలతో రోగాలు దూరం

ముప్పాళ్ళ: తొలకరి చినుకులు పడుతున్నాయంటేనే పాడి రైతుల్లో ఆందోళన మొదలవుతుంది. ఇందుకు ప్రధాన కారణం పాడి పశువులకు సోకే వ్యాధులే. వర్షాల నేపథ్యంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున్న అప్రమత్తంగా వ్యవహరించి, టీకాలు వేయిస్తే ఫలితం ఉంటుందని పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి చెబుతున్నారు. వ్యాధులను నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన వివరిస్తున్నారు.

వర్షాకాలం.. వ్యాధుల కాలం

వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధుల బెడద అధికంగా ఉంటుంది. వాటిని రక్షించుకోవాలంటే పశువులకు ముందస్తు టీకాలు వేయించాల్సిన అవసరం ఉంది. వర్షాకాలం పాడి పరిశ్రమతో పాటు వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచే ఎద్దులకు ప్రాణసంకటం లాంటిది. ఈ కాలంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, చిటుకు వ్యాధులు సోకుతాయి. ఈ వ్యాధులు సోకితే పశువుల్లో వ్యాధి నిరోధకశక్తి తగ్గితుంది. మండలంలో 10,234 గేదెలు, 1,052 ఆవులు, 8,052 గొర్రెలు, 762 మేకలు ఉన్నాయి.

టీకాలు తప్పనిసరి

వర్షాకాలంలో సోకే వ్యాధుల నివారణకు పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలి. కొందరు రైతులు పాడి దిగుబడి తగ్గిపోతుందని టీకాలు వేయించడానికి వెనకడుగు వేస్తారు. టీకాలు వేయించడం వల్ల పాల దిగుబడి తగ్గిపోతుందనేది ఓ అపోహ మాత్రమే అంటున్నారు పశు వైద్యులు. వ్యాధులు ముదిరి పశువులు మృతి చెంది నష్టపోవడం కన్నా ముందస్తు టీకాలు వేయిస్తే వ్యాధులు సోకకుండా నివారించవచ్చని చెబుతున్నారు.

జబ్బ వాపు వ్యాధి

ఈ వ్యాధి క్రిలాస్టిడియం చావై అనే బ్యాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంది. ఇది పశువులు, గొర్రెలు, మేకలకు హాని కలిగించే తీవ్రమైన అంటువ్యాధి. తెల్ల పశువుల్లో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు వయస్సున్న పశువులకు ఎక్కువగా సోకుతుంది. ఈ వయస్సులో పశువులకు రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. మట్టి ద్వారా కలుషితమైన మేత, నీటి ద్వారా పశువు శరీరంలోకి ప్రవేశించి వ్యాధి సంభవిస్తుంది. భుజం, తొడ కండరాలకు ఆశించి కుళ్లిపోయేలా చేస్తుంది. వాపుతో పశువులు కుంటుతాయి. ఈ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ ఒక్కటే సరైన మార్గమని పశు వైద్యులు సూచిస్తున్నారు.

గొంతు వాపు వ్యాధి

పశువులకు ప్రధానంగా గొంతువాపు వ్యాధి సోకుతుంది. దీన్నే గురక వ్యాధి అని కూడా అంటారు. గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. అలాగే గొర్రెలు, మేకలు, పందులకు కూడా సోకుతుంది. ఇది అంటు వ్యాధి, కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతూ గురక, శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. వ్యాధి సోకిన వాటికి జ్వర తీవ్రత 106, 107 డిగ్రీల వరకు ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి వాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో పశువులు మరణించే అవకాశం ఉంటుంది.

నివారణ చర్యలు

ఈ వ్యాధి నివారణకు జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి సోకిన పశువుల దొడ్డిని ఫినాయిల్, క్రిసాల్ వంటి క్రిమిసంహారక ద్రావణంతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. తప్పనిసరిగా పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

గాలికుంటు వ్యాధి

వాతావరణ మార్పులతో కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తల్లి పాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంది. ఏటా వర్షాకాలంలో ఆవులు, గేదెలకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. ఈ వ్యాధి గిట్టలు ఉన్న ప్రతి జీవికి సోకుతుంది. వ్యాధి సోకినప్పుడు పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు వచ్చి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వ్యాధి సోకిన పశువులు మేత తీసుకోలేక నీరసించిపోతాయి.

నివారణ మార్గాలు

వ్యాధి సోకిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. నోటిలో ఉన్న పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు మందు ద్రావణంతో శుభ్రం చేసి ఈగలు వాలకుండా వేప నూనె రాయాలి. యాంటి బయాటిక్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది.

సకాలంలో టీకాలు వేయించాలి

వర్షాకాలం పశువులకు వ్యాధుల కాలం. ముందస్తుగా టీకాలు వేయించినట్లయితే వ్యాధుల నుంచి పశువులను కాపాడుకోవచ్చు. టీకాలు వేస్తే పాలు తగ్గుతాయనేది అపోహ మాత్రమే. వ్యాధి తీవ్రత పెరిగితే ప్రాణానికే ప్రమాదం. అప్రమత్తంగా ఉండి సకాలంలో వైద్య సేవలు అందించటం ఎంతో మేలు.

– ఎం.పుల్లారెడ్డి, పశు వైద్యాధికారి

గతంలో మాదిరిగానే బదిలీలు చేపట్టాలి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంబాబు

ముప్పాళ్ళ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ సచివాలయాల బదిలీల కొరకు జీఓ. నెంబర్ 5లో ఇచ్చిన అంశాలలో సొంత మండలంలో పనిచేయకూడదని ఆదేశాలు జారీ చేయటం దారుణమని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఏపీవీడబ్ల్యూఎస్‌జీఈఏ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీ రాంబాబు అన్నారు. ఆదివారం ముప్పాళ్ళలో విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల బదిలీలు గతంలో మాదిరిగానే సొంత మండలం ప్రాతిపదికన చేపట్టేలా జీవోలో మార్పు చేయాలని కోరారు. దూర ప్రాంతాల బదిలీల వలన చిన్న స్కేలు తీసుకొంటున్న సచివాలయ ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారుతుందని, చాలీచాలని జీతాలతో వేరే మండలాలకు వెళ్లి కుటుంబాలను పోషించుకోవడం భారంగా ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సచివాలయ ఉద్యోగుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని బదిలీల ఉత్తర్వులలో మార్పులు చేయవలసిందిగా కోరారు. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న రేషనలైజేషన్ ప్రక్రియ తర్వాత మిగులు ఉద్యోగుల పరిస్థితిపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలన్నారు. పదోన్నతులు, క్లియర్‌జాబ్ చార్ట్ అమలుపై స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల అభ్యర్ధనలపై చొరవ చూపాలన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీ సీజ్

క్రోసూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని ఎస్‌ఐ పి.రవిబాబు ఆదివారం సీజ్ చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేట మండలం కోనూరు ఇసుక రీచ్ నుంచి దాచేపల్లికి టిప్పర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్నారు. ఇసుకకు, లారీకి సంబంధించిన వే బిల్లులు, ధ్రువపత్రాలు చూపనందున సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయాల కాంప్లెక్స్‌లో అన్యమతస్తులకు అవకాశమివ్వొద్దు

విశ్వహిందూ పరిషత్ మండల సమావేశంలో తీర్మానం



సమావేశానికి హాజరైన వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

అమరావతి: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ మండల సమావేశం వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన జరగనున్న రామలింగేశ్వర స్వామి ఆలయ దుకాణాల అద్దెల బహిరంగ వేలంలో అన్యమతస్తులకు దేవదాయ శాఖ అవకాశమివ్వకూడదని, ఆలయ అభివృద్ధికి క్రమం తప్పకుండా బహిరంగ వేలం పాటలను నిర్వహించాలని, ఆలయ పవిత్రతను కాపాడుతూ రోజు వారి పూజలు, కైంకర్యములను సక్రమంగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. ఈ తీర్మానం అనుసరించి విశ్వహిందూ పరిషత్ కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. తొలుత దేవదాయ శాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అమరావతి మండల శాఖ సభ్యులు మద్ది ఆనంద్, మల్లెల విశ్వనాథం, అన్నవరపు రమేష్, రాయి నాగరాజు, కోలా సాంబశివరావు పసుపులేటి రామనాథ్, గరినేని భాస్కరరావు, కోలా వెంకటేశ్వరరావు, బీజేపీ స్టేట్ కౌన్సెలింగ్ మెంబర్ మద్ది జాత్రి నారాయణ, పల్నాడు జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ గోకినేని వెంకటరమణ, పల్నాడు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఓబీసీ జనరల్ సెక్రటరీ నారాదాసు నరసింహారావు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండర్ హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలి

- సర్వే చేసి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి
- న్యాయవాది, సామాజిక కార్యకర్త నరిశేటి వేణుగోపాల్



సత్తెనపల్లి: పట్టణంలో రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపారాలు చేసే వారి కోసం వినియోగదారులకు అందుబాటులో ఉండే ప్రాంతాలను గుర్తించి 'స్ట్రీట్ వెండర్ హాకర్ జోన్లు' ఏర్పాటు చేసే విధంగా సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి తగు చర్యలు చేపట్టాలని స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణకు న్యాయవాది, సామాజిక కార్యకర్త నరిశేటి వేణుగోపాల్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో రోడ్లకు ఇరువైపులా తోపుడు బండ్లు, కూరగాయలు, పండ్లు, కొబ్బరి బొండాలు, పూల దుకాణాలు యథేచ్ఛగా, ఇష్టారీతిన వీధి వ్యాపారాలు జరుగుతున్నాయని, వీటితో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జన సమర్థం ఎక్కువగా ఉండే సత్తెనపల్లి చెక్‌పోస్ట్ నుంచి గడియార స్తంభం మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు, గాంధీ బొమ్మల సెంటర్, గార్లపాడు బస్టాండ్ రోడ్, రైల్వే స్టేషన్ రోడ్, రిజిస్ట్రార్ ఆఫీస్ రోడ్, అచ్చెంపేట రోడ్, గోళ్ళ మూడివారివీధి ఇలా సత్తెనపల్లి పట్టణంలో అనేక ప్రాంతాల్లో వీధి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయంతోపాటు, వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారన్నారు. అనేక సందర్భాల్లో ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఫిష్, మటన్ అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయని, ఎక్కడ పడితే అక్కడ ఫిష్, మటన్, బీఫ్ అమ్మకాలు జరపకుండా 'నిర్దేశించిన ప్రదేశాలలో' మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్ట్రీట్ వెండర్స్ సర్వే నిర్వహించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

సీపీఐ కార్యవర్గ సభ్యులు కొమ్మాలపాటి శరత్‌చంద్ర



మాట్లాడుతున్న కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ

పెదకూరపాడు: గ్రామీణ ప్రాంతాల్లో సీపీఐని బలోపేతం చేయాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ కార్యవర్గ సభ్యులు కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ఆదివారం సీపీఐ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ నాయకులు పటాన్ నాగుల్ మీరా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ ప్రతి సీపీఐ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఏఐటీయూసీ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ మాజీ నాయకులు వెల్లలచెరువు మల్లేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి సీపీఐ అభివృద్ధికి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం వంద సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా లేకపోయినా ఎర్రజెండా ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తుందని, ఈ పోరాటాలలో అన్ని వర్గాల ప్రజలు మమేకమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల వైపు నిలబడి పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేలపాటి ఏసోబు, ఎం.రతన్ బాబు, కె.మార్కు, తాళ్లూరి మల్లికార్జునరావు, పి.మస్తాన్, దావీదు, ఎస్‌కే సైదా, నాగేశ్వరరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



చిలకలూరిపేట(యడ్లపాడు): విద్యార్థులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. పట్టణంలోని సీఆర్ కాలనీ పార్కులో ఆదివారం రూ.10వేల విలువైన నోట్‌బుక్స్‌ను 25 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. సీఆర్ కాలనీ అసోషియేషన్ అధ్యక్షుడు గుడిపల్లి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కమిషనర్ శ్రీహరిబాబు, అర్బన్ సీఐ పి.రమేష్ పాల్గొని నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ కోటి సుబ్బారావు, కోశాధికారి చిరుమెళ్ళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దాతల సహకారంతో బస్‌షెల్టర్



నాదెండ్ల: జాతీయరహదారి గణపవరం ఆర్చ్ వద్ద దాతల సహకారంతో రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన బస్‌షెల్టర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చిలకలూరిపేట ఆర్‌కే హాస్పటల్స్ వైద్యుడు చాపలమడుగు రామకృష్ణ షెల్టర్ నిర్మాణానికి రూ.5 లక్షలు అందించగా, మరికొందరు దాతలు ఆర్థిక సాయం అందించారు. బస్‌షెల్టర్‌లో ఫ్యాన్, లైటింగ్ ఏర్పాటు చేశారు. త్వరలో షెల్టర్ ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు కాట్రు శ్రీనివాసరావు, కెల్లంపల్లి అచ్చయ్య, కంచర్ల శ్రీనివాసరావు తెలిపారు.

నీట్ ఫలితాల్లో నిత్య శ్రీ ప్రతిభ



మాచర్ల రూరల్: దేశవ్యాప్తంగా లక్షలాది మందితో పోటీ పడి కఠినంగా ఉండే ప్రశ్నాపత్రాలను సాధన కష్టమైన ఇష్టపడి చదివి ఈడబ్ల్యూఎస్‌లో 401వ ర్యాంకు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చిన నిత్య శ్రీని పలువురు అభినందించారు. మాచర్ల మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ చిలంకూరి శ్రీనివాసరెడ్డి కుమార్తె నిత్యశ్రీ నీట్‌లో భారతదేశ స్థాయిలో 4,500 ర్యాంకు, నీట్‌లో 574 మార్కులు, ఈడబ్ల్యూఎస్‌లో 401 ర్యాంకు సాధించింది. మొదటి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించటంపై ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిత్య శ్రీ మాట్లాడుతూ తాను హైదరాబాద్ మల్లారెడ్డి కళాశాలలో ఇంటర్ చదువుతూ అక్కడే కోచింగ్ తీసుకున్నట్లు తెలిపారు. ఏకాగ్రత, పట్టుదల, పక్కా ప్రణాళిక, సమయపాలనతో విద్యనందుకున్నానని, ముఖ్యంగా గురువులందించిన ప్రతి అంశాన్ని గుర్తుంచుకొని చదువును కొనసాగించానన్నారు.

చెస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం

గురజాల రూరల్: కీర్తి చెస్ అకాడమి పల్నాడు చెస్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలకు విశేష ఆదరణ లభించింది. స్థానిక అక్షరా స్కూల్‌లో ఆదివారం చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు.

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత



మాట్లాడుతున్న సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి

సత్తెనపల్లి: సంపద సృష్టిస్తా.. ప్రజలందరికీ సంపద పంచి పెడతానంటూ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పాలనపై ఏడాది తిరగకుండానే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పట్టణ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో డాక్టర్ గజ్జల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతల దాడులు, పోలీసుల వేధింపుల కారణంగా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల ఉప సర్పంచ్ కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో త్వరలో రెంటపాళ్లలో జరగనున్న నాగమల్లేశ్వరరావు విగ్రహావిష్కరణలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొని ఆ కుటుంబాన్ని పరామర్శించనున్నారని తెలిపారు. ఏడాది కాలంగా రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా గాడి తప్పిందని, కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. కూటమి నేతల మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలపై అధిక ధరలు, పన్నుల భారం తప్ప మరేమీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేయడంలో కూటమి నేతలు రికార్డు సృష్టించారన్నారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గ్రహించకుండా దాడులకు పాల్పడటం, అక్రమ కేసులు పెట్టడం వారికి ఆనవాయితీగా మారిందన్నారు. రెంటపాళ్లలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. విగ్రహావిష్కరణ నేపథ్యంలో చేపట్టాల్సిన పనులపై ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు డాక్టర్ గీతాహాసంతి, పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివరావు, రాజారపు శివనాగేశ్వరరావు, లోకా మాధవలు మాట్లాడారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పార్టీ నాయకులు అచ్యుత శివ ప్రసాద్, జొన్నలగడ్డ ఆనంద్, సయ్యద్ గోర, వరికల్లు కోటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరు మృతి, మరొకరికి గాయాలు

నకరికల్లు: గుర్తు తెలియని వాహనం ఢీ కొని తీవ్ర గాయాలపాలైన వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లుకు చెందిన కళ్లకుంట సైదులు (30) హైవే పక్కన గల పాఠశాల ఎదుట రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో పిడుగురాళ్ల వైపు అతి వేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో సైదులుకు తీవ్రగాయాలు కాగా నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య మాణిక్యం, కుమార్తె ఉన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు.

దేచవరం కుంట వద్ద...

మండలంలోని దేచవరం కుంట వద్ద ఆటోను ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టిన ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయిన ఘటన జరిగింది. నరసరావుపేట వైపు నుంచి నకరికల్లు వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తున్న శ్రీనివాస్ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టాడు. దీంతో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో క్షతగాత్రుడిని నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనేలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు.

బీసీల సమస్యలపై ఐక్యంగా పోరాడాలి



గురజాల: పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవచ్చని అఖిలభారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పల్నాడు కన్వెక్షన్ హాల్‌లో అఖిల భారతీయ మాదవ మహా సభ ఆధ్వర్యంలో గురజాల, మాచర్ల నియోజకవర్గాల సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ అధ్యక్షత వహించారు. వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల కారణంగానే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టిందని చెప్పారు. రాజ్యాధికారం కోసం కొన్ని పార్టీలు కూటమిగా ఏర్పడి విజయం సాధిస్తున్నాయి. కానీ బీసీలంతా కూడా కూటమిగా ఏర్పడి రాజ్యాధికారం కోసం ఎందుకు ముందుకు సాగడం లేదని చెప్పారు. జనాభా ప్రతిపాదికన రాజ్యాధికారం కోసం బీసీలకు అర్హత ఉందన్నారు. గాంధీ మాట్లాడుతూ బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలంటే మనందరం ఒక తాటిపై ఉండి రాజ్యాధికారం కోసం పాటుపడాలన్నారు.